ప్రజాశక్తి

శుక్రవారం 13 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

అదనపు భారం సశేషం

- విద్యుత్ వినియోగదారులకు బిల్లుల షాక్
- ట్రూఅప్, సర్‌ఛార్జీల పేరుతో కొనసాగుతున్న వసూళ్లు
- ప్రతి బిల్లుకు రూ.200 నుంచి రూ.400వరకు వసూలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక వైపు విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి ప్రతినెలా అదనపు భారం మోపడంపై వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగంపై అదనపు ఛార్జీల వసూలుపై సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఎడమ చేత్తో సాయం చేసి ఎడమచేత్తో ఇచ్చి కుడిచేత్తో లాక్కుంటున్నారనే విమర్శలు ప్రభలంగా విన్పిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలుపెరిగాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు నష్టాలు వస్తున్నాయనేసాకుతో ఏళ్ల తరబడి వివిధ రకాల ఛార్జీల వసూలు కొనసాగింపు గతంలో ఎన్నడూ జరగలేదని వాపోతున్నారు. ప్రజలు వినియోగించుకున్న యూనిట్లతో వచ్చే బిల్లు కన్నా అదనపు ఛార్జీల భారం తడిసి మోపెడు అవుతోంది. సగటున నెలకు రూ.200 నుంచి రూ.400 వరకు అదనపు భారం పడుతోంది. 100 నుంచి 150 యూనిట్లు వినియోగించే మధ్య తరగతి ప్రజలకు సాధారణ ఛార్జీల బిల్లు రూ.500 వరకు వస్తుండగా ఇతరఛార్జీలు రూ.300 వరకు భారంపడుతోంది. ట్రూఅప్ చార్జీలు ఏకంగా 36నెలలపాటువసూలు చేయాలని నిర్ణయించారు. అలాగే 2021మేనెలలో ఎఫ్‌పిపిసిఏ ఛార్జీలు, సాధారణ సర్‌ఛార్జి, కస్టమర్ ఛార్జీ, ఫిక్స్‌డ్ ఛార్జీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఇలా అదనపు భారం ప్రతి బిల్లుకు రూ.200 నుంచి రూ.400 వరకు భారం పడుతోంది. అన్ని తరగతుల వినియోగదారులపై ప్రభుత్వం అదనపు భారం కొనసాగిస్తోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని 2019 ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన సిఎం వైఎస్ జగన్ ఇప్పుడు ప్రతినెలా అదనపు భారం మోపడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏడాదికి సగటున రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు భారం పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. సహజంగా వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ఏడాది గడచిన 10 నెలల్లో పట్టుమని 10 రోజులు కూడా చల్లని వాతావరణం లేకపోవడం వల్ల విద్యుత్ వినియోగం ఏమాత్రం తగ్గడంలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో సాధారణ బిల్లులతో పాటు అదనపు భారం కూడా మరింతగా వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నాయి ఉమ్మడి జిల్లాలో మొత్తం 17.50 లక్షల మందిపై వినియోగదారులు ఉండగా వీటిల్లో 16 లక్షల మంది పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. జిల్లా వాసులపై ఏటా రూ.60 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, బిల్లు చెల్లింపులో ఆలస్యానికి అదనపు రుసుము కూడా పడనుంది. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 నెలలు వసూలు చేశారు. ఇంకా 21 నెలలు వసూలు పర్వం కొనసాగనుంది. ట్రూఅప్ వల్ల ప్రతినెలా రూ.30 నుంచి రూ.100 వరకు అదనపు భారం పడుతోంది. 2014-2019లో

2 లో

నిడమర్రులో సిపిఎం ప్రజాచైతన్యయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేత వి కృష్ణయ్య

రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన అధికార, ప్రతిపక్షం

మంగళగిరి నియోజకవర్గ సిపిఎం పాదయాత్ర ముగింపు సభలో వి కృష్ణయ్య

42 గ్రామాల్లో 10రోజులు 200 కిలోమీటర్ల పాదయాత్ర

సిపిఎం బృందానికి సమస్యల వెల్లువ - అడుగడుగునా జన నీరాజనం

నవులూరులో ...

2 లో

వామపక్షాల ప్రజాబ్యాలెట్‌లో ఓటు వేస్తున్న ప్రజలు

విద్యుత్ ఛార్జీలపై వామపక్షాల ప్రజాబ్యాలెట్

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ట్రూ అప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారాలు వేస్తున్నారని సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీ కాంత్, కె.మాల్యాద్రి విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరశిస్తూ గురువారం వామ పక్షాల ఆధ్వర్యంలో స్థానిక బి.ఆర్. స్టేడియం వద్ద ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ సంద ర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ గతంలో చెల్లించిన బిల్లులకు ఇప్పుడు ట్రూ అప్, సర్దుబాటు పేరుతో మరోసారి భారాలు మోపటం అన్యాయ మన్నారు. కరెంట్ బిల్లులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రభుత్వం విద్యుత్ బిల్లులపై పునరాలోచించి అదనపు భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాల్యాద్రి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో ప్రజలు ఓ వైపు సతమతమవుతుంటే మరో వైపు విద్యుత్ బిల్లులు పెరుగుదల మూలిగే నక్కపై తాటి కాయ పడిన చందంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నగర కమిటీ సభ్యులు లక్కా అరుణ, షేక్ ఖాశిం షహీద్, ఎస్.కార్తీక్, షేక్ ఖాశింవలి, నాయకులు టి.రాధ, వాసు, టి.శ్రీనివాసరావు, బాషా, నరసింహ, సిపిఐ నాయకులు అంజిబాబు, చిన్న పాల్గొన్నారు.

వార్తలు లోపలి పేజీల్లో

ఫలించిన రైతుల ఆందోళన

ఉండవల్లి లిఫ్టుకు విద్యుత్ పునరుద్ధరణ

లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా రుణాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు

తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

-ముందస్తు ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్ల పదవీకాలం పూర్తి

ఫార్మసిస్టులకు ఉజ్వల భవిష్యత్తు

వందశాతం ఫార్మసిస్టు పోస్టుల భర్తీ - ఔషధాలపై అప్రమత్తత అవసరం

ఫార్మసి కౌన్సిల్ ఆదర్శంగా పనిచేయాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వైద్య ఆరోగ్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఎపి ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చదువులో సత్తా చాటిన విద్యార్థులు, బోధనలో ప్రతిభచూపిన కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోవిడ్ సమయంలో కష్టపడి పనిచేసిన ఫార్మాసిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల జింఖానా అడిటోరియంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన మొత్తం 240 మందికి ఈ సన్మానం జరిగింది. కార్యక్రమానికి మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మద్దాలిగిరి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

2లో

సభలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

ఫార్మసిస్టులకు ఉజ్వల భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

కె.హేమచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ షాజిల తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ . అభివృద్ధి చెందిన దేశాల్లో ఫార్మాసిస్టులు కీలకంగా ఉన్నారని తెలిపారు. మన దేశంలోనూ ఇప్పుడిప్పుడే ఫార్మాసిస్టులకు తగిన గుర్తింపు దక్కుతోందన్నారు. ఫార్మకాలజీ, పెథాలజీ, న్యాయశాస్త్ర, జంతు, వక్ష శాస్త్రాలు ఇలా ఎన్నో అంశాలపై అవగాహన ఉండేది ఒక్క ఫార్మసిస్టులకే అని పేర్కొన్నారు.

జగనన్న చొరవతోనే ఫార్మసీ కౌన్సిల్

ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు పూర్తి స్థాయిలో కమిటీ గత 15 ఏళ్లుగా లేదని, ఫార్మసీ కౌన్సిల్ ను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా వదిలేసిందని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 15 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయి కమిటీని నియమించామని చెప్పారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఇప్పుడు ఇంత గొప్ప సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 53200 మంది సిబ్బందిని కొత్తగా నియమించిన గొప్ప ప్రభుత్వం తమదని అన్నారు. ఇందులో ఏకంగా 600 మంది ఫార్మసిస్టు పోస్టులు కూడా ఉన్నాయని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున ఫార్మసిస్టు నియామకాలు గతంలో ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. జీరో వేకెన్సీ విధానం కింద నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పుడు ఫార్మసిస్టు పోస్టుల ఖాళీలు సున్నా అని వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు, ఆరోగ్యశ్రీ సీఈవో ఎం.ఎన్.హరీంద్రప్రసాద్, ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. విలియం క్యారీ తదితరులు పాల్గొన్నారు.

అదనపు భారం సశేషం

(మొదటిపేజీ తరువాయి)

డిస్కంలకు వచ్చిన నష్టాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈఛార్జీల వసూలు పరంపర కొనసాగిస్తూనే తాజాగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్కంలకు వచ్చినసష్టాలకు కూడా గత నెల బిల్లు నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. యూనిట్‌కు రూ.40 పైసలు అదనంగా వసూలు చేయనున్నారు. ఇలా ఏడాదిపాటు ఈభారంపడుతుంది. ట్రూఅప్, 2021 మే నెలలో వాడుకున్న విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీ, 2023 ఏప్రిల్ నెలలో సర్దుబాటు ఛార్జీల రూపంలో మొత్తంగా కనీసం రూ.200 నుంచి గరిష్టంగా రూ.300 వరకు అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా వినియోగించుకున్న యూనిట్లకు కన్నా ఇతరఛార్జీల భారం రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రానున్న రెండేళ్లపాటు ట్రూ అప్ చార్జీల భారం కొనసాగనుంది. ఎగువ మధ్య తరగతి వారికి ఈ భారం ప్రతినెల రూ.400 నుంచి రూ.500 ఉంటోందని సంబంధిత వినియోగదారులు వాపోతున్నారు. చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు రూ.వెయ్యిపైనేభారం పడుతోంది. ప్రతిపక్షాలు ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రభుత్వం అదనపు భారం విషయంలో ఏమాత్రం వెనక్కితగ్గడం లేదు.

నేడు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కేఎల్ యు రోడ్డు వైపు విద్యుత్ లైన్లు మరమ్మత్తుల నిమిత్తం వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లెంపూడి గ్రామాలలో శుక్రవారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు వ్యవసాయ పంటలకు సరఫరా చేయు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంగళగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యన్నారాయణ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు,రైతులు విషయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన అధికార, ప్రతిపక్షం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ముగింపు సభలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

రాష్ట్రంలో అధికారం కోసం, అధికార దాహం కోసం అధికార, ప్రతిపక్షం కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాయని, రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలను అడగలేని పరిస్థితుల్లో ఉన్నాయని సిపిఎం రాష్ట్ర నాయకులు వి కృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని నిడమర్రు గ్రామంలో సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభను సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి అధ్యక్షత న నిర్వహించారు. సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటికీ ఇళ్ల స్థలాలు ఉద్యోగాల కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి, వాటికోసం అడుక్కోవలసిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. కేంద్రంలో బిజెపి రాకముందు అప్పు రూ.53 లక్షల కోట్లు ఉంటే ఇప్పుడు రూ.153 లక్షల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు జరపకుండా పదేళ్లపాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కేంద్రంలోని బిజెపికి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కానీ రాష్ట్రంలోని అధికార పక్షము ప్రతిపక్షము బిజెపికి దాసోహం అంటూ పోటీపడి మరి మద్దతు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. వారి వైఖరి వలన రాష్ట్రానికి గత పది ఏళ్లలో రావాల్సిన రూ.22 లక్షల కోట్ల రూపాయలను తెలుగు ప్రజలు నష్టపోయారని వివరించారు. దేశవ్యాప్తంగా మోడీకి వ్యతిరేక పవనాలు ఇస్తున్నాయని బిజెపి ఓడిపోనున్నదని ఇందుకు అనేక చర్చ వేదికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రజలంతా బిజెపికి వ్యతిరేకంగా నిలబడాలని అటువంటి పార్టీలకు మద్దతు ఇవ్వాలని ఎన్నికల్లో బిజెపిని, వాటికి మద్దతు ఇచ్చే పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ పాదయాత్రలో అనేక సమస్యలను అధ్యయనం చేయడం జరిగిందని చెప్పారు. మంగళగిరి దుగ్గిరాల తాడేపల్లి ప్రాంతాలలో నేటికీ ఇళ్ల స్థలాల సమస్య ఇళ్లపట్టాల సమస్య తీవ్రంగా ఉందని పాదయాత్రలో ప్రధాన సమస్యగా వెల్లడైందని వివరించారు. పాదయాత్రలో 200కు పైగా అర్జీలు వస్తే ఇళ్ల స్థలాలు పట్టాల కోసం ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను వివరించారని చెప్పారు. మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఎన్నో కాలనీలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు. ఆయా కాలనీలలో నేటికీ ఇళ్ల పట్టాలు మంజూరు కాలేదని ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న పాలకులు వాటిని ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నామంటూ ప్రచారాలు, సభలు పెద్ద ఎత్తున నిర్వహించారని నేడు నేడు వాటి పరిస్థితి ఏమిటో అందరికీ అర్థమైందని తెలిపారు. మంగళగిరి ప్రాంతంలో బహుళ అంతస్తుల సంస్కృతి పెరిగిపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉందన్నారు. మెగా ప్లాన్ మాస్టర్ ప్లాన్ పేర్కొంటున్నారే తప్ప ఎక్కడ అమలు కావడం లేదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో దళితులకు స్మశాన స్థలాల సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. ఆయా సమస్యలపై అధికారులకు 16వ తేదీన జరిగే ధర్నాలో విన్నవించునున్నామని చెప్పారు. 16వ తేదీన మంగళగిరి లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం మాట్లాడుతూ పాదయాత్రలో అనేక సమస్యలను అధ్యయనం చేయడం జరిగిందని చెప్పారు. చిన్నపాటి వర్షానికే కాలనీల రోడ్లు ఎలా మురికి కూపాలుగా మారుతున్నాయో చూసామన్నారు. రాజధాని రోడ్లు చిందరవందరగా తయారయ్యాయి ఈ పాలకులకు అవి కనిపించడం లేదా ... లేక కనిపించినట్లు నటిస్తున్నారా అని ప్రశ్నించారు. సీఎం ఇంటి ముందున్న యానాది కాలనీలకు మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉంటే అటువంటి కాలనీలలో పేదలకు ఖాళీ చేయాలంటూ మంగళగిరి మహర్షి నోటీసులు ఇవ్వడం గా విడ్డూరం గా ఉందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు నోటీసులు జారీ చేయడానికి తప్పు పట్టారు. రైతులు సాగునీరు అందక అవస్థలు పడుతుంటే హై లెవెల్ ఛానల్ కు నీటిని డంపింగ్ చేసే స్కీం ఏర్పాటుకు కనీసం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి కనిపించడం లేదా అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ పది రోజుల పాటు జరిగిన పాదయాత్రలో వచ్చిన సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు విన్నవించునున్నామని, పరిష్కారానికి పోరాటాన్ని చేస్తామని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ పది రోజులపాటు మూడు మండలాల్లో 42 గ్రామాలలో 200 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం జరిగిందని అనేక సమస్యలు పాదయాత్ర బృందం గుర్తించడం జరిగిందని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలను నిర్మించి ప్రజలను చైతన్యపర్చనున్నదని తెలిపారు. పాదయాత్ర జయప్రధాని కషిచేసిన పాదయాత్ర బంద సభ్యులకు కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు ప్రజానాట్యమండలి కళాకారులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.తొలత ప్రజానాట్యమండలి కళాకారులు గేయాలు ఆలపించారు. పుచ్చలపల్లి సుందరయ్య, సుందర రావు మాస్టారు చిత్రపటాలకు అమరవీరుల స్థూపాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ, ఎన్ భావనారాయణ, తాడేపల్లి నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, డి. వెంకట రెడ్డి, మేరీ, మంగళగిరి నాయకులు వై కమలాకర్, ఎం. భాగ్యరాజు, బి. కోటేశ్వరి, దేవరకొండ శ్రీను, పి. బాలకృష్ణ, వలబాపురం వెంకటేశ్వర రావు, ఎం.బాలాజీ, ఎం. రాజముని, ఎం. సిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లడుతున్న ఎం సూర్యారావు

ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఆవాసాలు

ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని సీపీఎం డిమాండ్

సీపీఎం పాదయాత్ర బృందానికి సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ :గ్రామాల్లోని పేదలు ఎక్కడ నివాసం ఉంటుంటే అక్కడే వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఈ నెల 3వ తేదీ నుండి ప్రారంభమైన పాదయాత్ర 10వ రోజుకు చేరింది. చివరి రోజు నవులూరులో ప్రారంభమైన పాదయాత్ర బృందంపై పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. పాదయాత్ర మండలం లోని నవులూరు, బేతపూడి, కురగల్లు, నిడమర్రులలో కొనసాగింది. నవులూరులో రోడ్ల వెంబడి, పోరంబోకు, చెరువుగట్లపై, ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు నివాస స్థలాలు కేటాయించాలని పాశం రామారావు అధికారులను కోరారు. మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత కుటుంబాలవారికి స్మశాన స్థలాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఖననం చేసేందుకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తుంటే వారికి కనీస వేతనాలను కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బిజెపికి వ్యతిరేకంగా అధికార ప్రతిపక్షాలు నిలవకపోవడం విచారకర మన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను, హామీల అమలును కనీసం ప్రశ్నించకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎం. రవి, వై నేతాజీ ఎం భావన్నారాయణ వల్లభాపురం వెంకటేశ్వరరావు ఎస్ రామరాజు అత్తలూరు వీర వెంకయ్య నండూరి సురేష్ సుబ్బారావు బూరుగ వెంకటేశ్వర్లు, డి. వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వార్డు సచివాలయంలోనూ సురక్ష శిబిరం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పట్టణ ప్రాంతాల్లోనూ వార్డు సచివాలయాల వారీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పొన్నూరు రోడ్డులోని ఆనందపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి విడదల రజిని హాజరయ్యారు. ప్రతి వార్డు సచివాలయానికి ఒక వైద్య శిబిరం నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయించారని పేర్కొన్నారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు క్యాంపులు పెరిగే వీలుందని వెల్లడించారు. దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. టిడిపి హయంలో ప్రభుత్వ ఆస్పత్రులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా.. రాష్ట్రంలోని ఆస్పత్రులు శిథిలావస్థలో ఉండేవని గుర్తుచేశారు. ఆస్పత్రుల్లో వైద్యులు కూడా ఉండేవారు కాదని తెలిపారు. మందులు, వైద్య పరికరాల కొరత కూడా ఉండేదని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల కష్టాలు చెప్పడానికి వీల్లేదని పేర్కొన్నారు. ప్రజలు అన్ని ఇబ్బందులు పడుతున్నా టిడిపి ప్రభుత్వంలో కనీసం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రుల రూపురేఖలు మొత్తం జగనన్న మార్చేశారని చెప్పారు. ఇప్పుడు సరిపడా వైద్యులు ఆస్పత్రుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఆస్పత్రులను పూర్తిస్థాయిలో ఆధనికీకరించామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి పౌష్టికాహార పంపిణీ చేపట్టారు. కంటిచూపు సమస్య ఉన్న వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా, జీడీసీసీబీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, మున్సిపల్‌కమిషనర్ కీర్తి చేకూరి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో మహిళ మృతి

ప్రజాశక్తి-ఈపూర్

విద్యుత్ షాక్ తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీనగర్ గ్రామ సమీపంలోని కోళ్లఫారంలో గురువారం జరిగింది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకా రం కోళ్ల ఫారంలో పనిచేసేందుకు నెలరోజుల క్రితం ఒరిస్సా రాష్ట్రం నుండి నిరాకర్ కుటుంబం వలస వచ్చి ఉంటోంది. నిరాకర్ భార్య నీలేంద్రి(35) రోజు మాదిరిగానే బట్టలు ఇనుప తీగపై ఆరవేసే క్రమంలో ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. అక్కడి కక్కడే కుప్ప కూలి మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు సంతానం. భర్త నిరాకర్ జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసు పత్రికి తరలించారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కుటుంబ కలహాల కారణంగా కానిస్టేబుల్ సున్నం రాజేష్ (38) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజేష్, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులో నివాసం ఉంటున్నాడు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కుటుంబ, ఆస్థి వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయినట్లు సమాచారం. దీనికి తోడు మద్యానికి బానిసైన రాజేష్ భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు స్థానికులు, కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీ కరించారు. ఘటనా స్థలా నికి గ్రామీణ ఎస్.ఐ ఈ. బాల నాగిరెడ్డి చేరుకుని పరిస్థితిని సమీ క్షించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు.

మృతుడు కానిస్టేబుల్ సున్నం రాజేష్

ద్విచక్రవాహనాల దొంగ ఆరెస్టు

11 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-మాచర్ల

పదకొండు బైకులు స్వాధీనం చేసుకోని ద్విచక్ర వాహనాల దొంగను ఆరెస్టు చేసినట్లు అర్బన్ సిఐ బాల క్రిష్ణ తెలిపారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఐ బాలక్రిష్ణ మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో పట్టణ ఎస్ఐ సౌందర్ రాజన్ సిబ్బందితో కలిసి మాచర్ల టౌన్‌కి చెందిన మొగిలి నాగరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణ చేయగా మాచర్ల టౌన్‌కి చెందిన 8 బైకులు, ఇతర ప్రాంతాలకు చెందిన మరో 3 బైకులను అతని నుండి స్వాధీనం చేసుకుని ఆరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. 11 బైకుల విలువ రూ 11.59 లక్షలు అని సిఐ వివరించారు. ఈ కేసులో పని చేసిన అర్బన్ సిఐ, ఎస్.ఐ సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్.పి, గురజాల డిఎస్‌పిలు అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సిఐ పి. ప్రేమయ్య హెచ్చరించారు. సిఐ మాట్లాడుతూ సత్తెనపల్లి సర్కిల్ ఫరిదిలో వున్న రాజుపాలెం ,ముప్పాళ్ళ ,నకరికల్ , సత్తెనపల్లి రూరల్ పిఎస్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు ప క్రికెట్ బెట్టింగులు, లాటరీలు , సింగిల్ నెంబర్లు, పేకాట, కోడి పందేలు నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట : స్థానిక పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలిచారని, రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ ఫెడ రేషన్ గేమ్స్‌కు ఎన్నికైనట్లు రాష్ట్ర గేమ్స్ సెలక్షన్ కమిటీ తెలిపినట్లు ప్రధానోపాధ్యాయులు వై.హనుమంతరావు గురువారం తెలిపారు. ఇటీవల పునుగుపాడులో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిహెచ్ డేవిడ్, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల జరిగిన ఫట్ బాల్ పోటీలలో ప్రశాం త్, స్థానిక ఎఎంజిలో జరిగిన నెట్ బాల్ పోటీల్లో పఠాన్ అల్తాఫ్, తన్నీరు సుబ్రహ్మణ్యం, నౌశిక్‌లు ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 25,302
మిర్చి ఎగుమతి	: 27,892
మిర్చి నిల్వ	: 9,280

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,000
నెం.5	10,500 - 19,500
273	10,000 - 20,000
341	10,000 - 22,500
4884	18,000 -18,000
సూపర్ 10	19,500 -19,500
	నాన్ ఎసి
తేజ	10,000 - 24,000
బడిగి	14,000 - 25,000
దేవనూరు డీలక్స్	15,000 - 21,500
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	10,500 - 22,500
నెం.5	18,000 - 18,500
273	17,500 - 18,000
341	13,000 - 23,000
తేజ	10,500 - 23,000
బడిగి	17,000 - 24,000
దేవనూరు డీలక్స్	15,800 - 24,000
తాలుకాయలు	6,500 -13,000

పొన్నూరులో మైనర్ బాలికపై లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని సిద్ధి వినాయక నగర్ లో మైనర్ బాలికపై అదే పేటకు చెందిన 50 సంవత్సరాలు వయసు గల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 7 వ తేదీ సాయంత్రం సిద్ధి వినాయక నగర్ లో నివసిస్తున్న 11 సంవత్సరాల బాలికపై అదే కాలనీకి చెందిన బాలిక ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న 50 సంవత్సరాల వ్యక్తి బాలిక ఇంట్లో కి ప్రవేశించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ,అమె కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు.

పొన్నూరు అర్బన్ సీఐ ఎండి కాజా అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

సురభి వెంకటేశ్వర్లుపై ఎమ్మెల్యే కక్ష సాధింపు తగదు

ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని జాలలపాలెం గ్రామానికి చెందిన సురభి వెంకటేశ్వర్లుపై వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించడం దుర్మార్గమని ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. వినుకొండ సబ్ జైల్లో రిమాండ్ లో ఉన్న వెంకటేశ్వర్లును కలిసేందుకు గురువారం వినుకొండ సబ్ జైల్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల అన్యా క్రాంతంపై సురభి వెంకటేశ్వర్లు ఇటీవల లోకాయుక్త, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై సురభి వినుకొండ కోర్టులో ప్రైవేటు కేసు వేశారని, దీంతో కక్ష కట్టిన ఎమ్మెల్యే ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సురభి కొనుగోలు చేసిన భూమిని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు వినుకొండ లోని కొందరు విలేకరులకు స్థలాల కేటాయింపుకు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయగా వెంకటేశ్వర్లు కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యే, కొందరు అధికారులు ఒకవైపు రాజీ అంటూ మరోవైపు గతంలో ఉన్న తప్పుడు కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్న కావాలని అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం దుర్మార్గమన్నారు. పేద బీసీ రజక కులస్తుడు అయిన వెంకటేశ్వర్లు హైకోర్టులో తానేసిన దావాను ఉపసంహరించుకోవాలని చర్చలు జరిపి రాజీ సంతకాలు పెట్టించి కోర్టులో దాఖలు చేసి మరోవైపు పాత కేసు నమోదు చేయించి ఆయనను రిమాండ్‌కు తరలించడం మోసపూరితమని అన్నారు. తనపై కులదూషణ, దౌర్జన్యం చేశారని ఎమ్మెల్యేపై వినుకొండ

కోర్టులో ప్రైవేటు కేసు వేయడం, వినుకొండ ప్రాంతంలో జరుగుతున్న భూ కుంభకోణాలపై అడ్డుకుంటున్నారని, న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని ఉద్దేశంతోనే కక్ష కట్టి ఎమ్మెల్యే, అధికారులు కలిసి అక్రమ కేసుల్లో అరెస్టు చేయించారని అన్నారు. సురభి వెంకటేశ్వర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు, అక్రమ అరెస్టులపై ఉన్నత దర్యాప్తు జరిగితే రెవిన్యూ అధికారులు, అధికార పార్టీ నేతల అక్రమాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గిరిజన సంగం నాయకులు కోట నాయక్, పిడిఎమ్ నాయకులు వై. వెంకటేశ్వర రావు,మస్తాన్ వలి, సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బుదాల శ్రీను, బీఎస్పీ నాయకులు నేరెళ్ల రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, మాల మహానాడు నాయకులు కీర్తి పాటి వెంకటేశ్వర్లు, ఏసురత్నం, విజయ్ తదితరులు ఉన్నారు.

మిర్చి పంటల పరిశీలన

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

నీటిని పొదుపుగా వాడుకోవాలని పల్నాడు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి జె.బెన్ని మిర్చి రైతులకు సూచించారు.పల్నాడు జిల్లా సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాల్లో ఉద్యానవన శాఖ అధికారులు మిర్చి పంటలను పరిశీలించారు.

ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ అయిన పల్నాడు జిల్లా నరసరావుపేట వల్లపచెరువుకు చెందిన కె.సీతారామ హరుణ్ S/o నాగేశ్వరరావు వలన సమాచారంపొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ కె.సీతారామ హరుణ్ ది. 14-09-2023 న దిగువ షెడ్యూల్ ఆస్థిని దఖలు దస్తావేజు (డాక్యుమెంట్ నెం. 22869/2023) ద్వారా 190 చ.గ స్థలాన్ని నరసరావు పేట సబ్ రిజిస్ట్రార్ నందు రిజిస్టర్ చేసుకున్నారు. అనంతరం నా క్లయింట్ రిజిస్టర్ ఆఫీస్ నుండి వల్లపు చెరువులోని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.6366/1996 ఉన్న కవర్ మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల నాకు కానీ నాక్లయింట్‌కు కానీ వారంరోజులలోపు అందజేయ కోరుతున్నాము. అట్లు కాకుండా లింక్ డాక్యుమెంట్లు ఎవరికైనా వాటిని దుర్వినియోగ పరిస్తే నా క్లైంట్ తీసుకొను చట్టమైన చట్టపరమైన చర్యలకు బాధ్యుల గుదురు. సదరు డాక్యుమెంట్లపై ఎటువంటి లావాదేవీలు ఋణములు లేవని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు.
M. Ravi kanth,Bcom,BL
S.R.Hanumanth Reddy, B.com LLB.
E. Shiva Kumar, MBA.LLM,
NARASARAOPET, PALNADU.DT.
Cell.NO:7306168563.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...
O.S : 220/2021

వాది: గోవిందు రామకృష్ణ గణపతి..
AND
ప్రతివాది: తోట శంకరబాబు S/o పూర్ణచంద్రరావు, వ్యాపారం, D.No: 37-365/1, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట పట్టణం.

పై నెం. దావాలో మీకు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఎన్నిసార్లు దావా నోటీసులు పంపినను మీరు దావా నోటీసులు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్టు వారి ఎదుట ది. 30-10-2023 న ఉదయం 10:30 ని.లకు హాజరయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా తేదీ. 30-10-2023.

**త్రిపురం రామకృష్ణ,
వాది తరపు న్యాయవాది,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.**

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...
O.S : 76/2020

వాది: కొక్కిరాల వీర చంద్రశేఖర్.
AND
ప్రతివాది: జంజులూరి చంద్రశేఖర్ S/o పాండురంగారావు, వ్యాపారం, D.No: M.P 69/146, C/o జాస్తి రంగారావు, సుభాని నగర్, చిలకలూరిపేట పట్టణం.

పై నెం. దావాలో మీకు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఎన్నిసార్లు మీకు దావా నోటీసులు పంపినను ఈ దావా విషయం మీకు తెలిసి కూడా మీరు దావా నోటీసులు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్టు వారి ఎదుట ది. 19-10-2023 న ఉదయం 10:30 ని.లకు హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించబడును.
శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా తేదీ. 19-10-2023.

**త్రిపురం రామకృష్ణ,
వాది తరపు న్యాయవాది,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.**

పురపాలక సంఘ కార్యాలయము, తెనాలి

ఆర్.ఓ.సి. నెం. 87/2022/ఎ1 తేది : 13-10-2023

బహిరంగ వేలము నోటీసు

తెనాలి పురపాలక సంఘ పరిధిలోని దిగువ తెలిపిన షాపు రూమునకు సంబంధించి బహిరంగ వేలము నోటీసు ఈ క్రింద తెలియజేయబడిన విధముగా ది. 25-10-2023 బుధవారము ఉదయం 11-00 గం.లకు పురపాలక సంఘ కార్యాలయము నందు మున్సిపల్ కమీషనరు గారిచేగాని లేక వారి అనుమతి పొందిన మరి ఏ ఇతర అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ.నెం.	వేలము నిర్వహణ అంశము పేరు	ప్రారంభ ధరావత్తు రూ.	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ
1.	శ్రీ తెనాలి రూపస్‌పాల్, మరియు సుజాత గార్ల జ్ఞాపకార్థము నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.5	10,000/-	1,00,000/-

వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై ప్రకటించిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ ధృవపత్రము మరియు ఇ.సి. ధృవపత్రములు ముందుగా దాఖలు చేసి వేలములో పాల్గొనవలెను. సాల్వెన్సీ ధృవపత్రము లేనివారు సాల్వెన్సీ మొత్తమును నగదు రూపములో పురపాలక సంఘమునకు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. వేలం తేదీలు మార్పు చేయు విషయములో కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములు కార్యాలయ పనివేళల యందు రెవిన్యూ సెక్షన్ నందు సంప్రదించి తెలుసుకొనవచ్చును.

**సం/- కమీషనరు,
తెనాలి పురపాలక సంఘము**

విజయలక్ష్మి లాంచీ విజయవాడకు తరలింపు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని విజయపురి సౌత్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక కేంద్రమైన లాంచి యూనిట్‌లో పాడైపోయిన విజయలక్ష్మి లాంచ్ ని విజయవాడకు తరలిస్తున్నారు. లాంచ్ యూనిట్ మేనేజర్ భైరవ స్వామి మాట్లాడుతూ విజయపురి సౌత్ లో మొట్టమొదట 1964 సంవత్సరంలో లాంచి స్టేషన్ అనుపు వద్ద ప్రారంభించారు. లాంచ్ యూనిట్ కి మొట్ట మొదటి లాంచి విజయలక్ష్మి గా పేర్కొన్నారు. అప్పటినుంచి 39 సంవత్సరాలుగా విజయపురిసౌత్ పర్యాటక కేంద్రంలో సేవలందించి గత కొంతకాలంగా మరమ్మతులకు గురైనట్టు తెలిపారు. ఈ లాంచి ని విజయవాడ బరంపురం పార్కుకు తరలించి అక్కడ మరమ్మత్తులు చేసి మరల పర్యాటకులు ప్రయాణించే విధంగా నడుపుతారని మేనేజర్ భైరవ స్వామి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజార్ వినయ్ తుల్లా లాంచ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-వినుకొండ

ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అతిథి ఆధ్యాపక ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాళాశాల ప్రిన్సిపల్ టి. ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జంతు శాస్త్రము బోధించేందుకు ఆసక్తి కలిగిన అధ్యాపకులు సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో పి.జి. కలిగి ఉండాలన్నారు. బిఈడి కలిగిన వాళ్లకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. దరఖాస్తుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంటుందని, అదే రోజునహాజరు కావాలని పేర్కొన్నారు. 2023 మార్చి, జూన్ నెలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పాస్ అయిన విద్యార్ధుల యొక్క ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థినీ విద్యార్థులు వచ్చి తమ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిందిగా కోరారు.

ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలకు ఎల్ఇడి లైట్స్ బహూకరణ

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ వైసిపి నాయకులు గోగుల పాటి షేక్ రెహమాన్, గ్రామ సచివాలయం కన్వీనర్ పాకాల పాటి షేక్ మౌలాలి ల సహకారంతో బెల్లంకొండ గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు మూడు పెద్ద ఎల్ఇడి లైట్లను ను గురువారం అందజేశారు. ప్రిన్సిపాల్ శివ నాగేశ్వరరావు,వార్డెన్ బాబు ల సమక్షంలో వాటిని బహూకరించారు.రాత్రి పూట విద్యార్థులకు చదువు కు సరైన లైట్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం వైసిపి నాయకుల దృష్టికి ప్రిన్సిపాల్,వార్డెన్ లు తీసుకువెళ్లడంతో వారు స్పందించారు. కార్యక్రమం లో వైసిపి నాయకులు గడ్డి పర్తి చినబాబు రావు,ముప్పాళ్ళ షేక్ దుదా మేస్త్రి, కొండవీటి షేక్ మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవాలి

- న్యూస్ క్లిక్ చానెల్‌పై ఎన్ఐఎ దాడులపై నిరసన
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మీడియా భారీ ర్యాలీ, ప్రదర్శన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఢిల్లీలో న్యూస్ క్లిక్ మీడియా చానెల్‌పై ఎన్ఐఎ అక్రమదాడులను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం స్థానిక బంగ్లా సెంటర్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు మీడియా భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో కెవిస్ చక్రవర్తికి సమ స్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాస్తవాలు మాట్లాడే వారిపై దేశద్రోహులు పేరుతో అక్రమ కేసులు పెట్టిస్తోందని, అందులో భాగంగానే న్యూస్ క్లిక్ చానెల్స్ , ఆఫీసులపై దాడులు జరిపి, కేసు నమోదు చేశారని అన్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న పేరుతో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై ఎన్ఐఎ అక్రమ దాడులు జరిపి భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు ఎన్ఐఎ దాడులను ఖండించాలని, ఎన్ఐఎను వెంటనే రద్దు చేయాలని, మీడియా, వామపక్ష సంఘాల పై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే భాగంలోనే సిఏఏ. ఎన్ఆర్సి, ఢిల్లీ రైతు ఉద్యమం, మణిపూర్ ఘటన తదితర అంశాలను మీడియా ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసిందని, దీనిని జీర్ణించుకోలేని బిజెపి ఆ సంస్థలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని, మీడియాను, పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవడం కోసం వామపక్ష భావాలు కలిగిన వారు, మీడియా వారు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెలగపల్లి శ్రీనివాసరావు భక్తులు వెంకటేశ్వర్లు బాబు, రామకృష్ణ ,సిపిఐ నాయకులు కృష్ణ నాయక్ , సుజాత, వెంకటేశ్వర్లు సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు నీలాద్రి రాంబాబు, అనిల్ కుమార్,కొండారెడ్డి చెన్నయ్య, వెంకటస్వామి ఎం సిపిఐ నాయకులు ఓర్చు కృష్ణ,భారత్ బచావో నాయకులు కోలా నవజ్యోతి, వివిధ ప్రజా సంఘాల నాయకులు, మీడియా కు చెందిన మంద అనిల్ కుమార్, కొమ్మా మహేష్, రంజాన్ వలి, మల్లేశ్వరి, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రికి పోస్ట్ కార్డు క్యాంపెయినింగ్ కార్య క్రమాన్ని పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురు వారం నిర్వహించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారధి మాట్లడుతూ సిపిఎస్ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అను సరించి 1-9-2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి శ్రీనివాసరావు,సీనియర్ నాయకులు సాయిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దాచేపల్లి

జిపిఎస్ రద్దు కోస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు క్యాంపెయిన్ నిర్వహిస్తూ వేలాదిగా ఉత్తరాలు పంపే కార్యక్రమం చేపట్టి నట్టు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సంద ర్భంగా యుటిఎఫ్ దాచేపల్లి మండల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిపిఎస్ ను రద్దు చేస్తానన్న హామీని మరచి ఆ స్థానంలో మరో జిపిఎస్ ను ప్రవేశపెట్టడం సరికాదని, ఉపాధ్యాయుల ఉద్యోగుల వేతనము నుండి కాంట్రి బ్యూషన్ వసూలు చేసే జిపిఎస్ పథకం వద్దని పాత పెన్షన్ విధానం కావాలని అన్నారు. డీఎస్సీ 2003 ఉపాధ్యా యులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రికి వారం రోజులలో వేలాది ఉత్తరాలను పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి టి.ఆనంద్ కుమార్,కోశాధికారి వి.వెంకట్రావు, సీనియర్ నాయకులు జి.శాంతరావు,మస్తాన్ వలి,మోజేష్,వెంకటేశ్వర్లు నాగూల్ మీరా, కొండలు,సుధాకర్ రెడ్డి,సాగర్ బాబు, వేణు గోపాలరావు, లు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీఐ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమాచార హక్కు చట్టం అమలు చేయడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 3 వ స్థానం లో వుందని, మహారాష్ట్ర చిట్ట చివరి స్థానంలో నిలిచిందని రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్చాల హరిప్రసాద రెడ్డి అన్నారు. అక్టోబర్ 12 వ తేదీ ఆర్టీఐ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్ లో గురువారం జరిగిన ఆర్టీఐ నేషనల్ సమ్మిట్ కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రానికి విచ్చేసిన కమిషనర్ హరి ప్రసాద్ రెడ్డికి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం,అదనపు ఎస్పీ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం. రామ్మోహనరావు,ఆర్డీఓ ఎం. శేషిరెడ్డి, తహశీల్దార్ రమణ నాయక్ లు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. జాతిపిత మహాత్మా గాంధీ,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అధికారులు ఎప్పటి రికార్డులు అప్పుడు పూర్తి చేసుకొంటే సహ చట్టం ప్రకారం సమాచారం ఇవ్వడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సహ చట్టం బోర్డు ఏర్పాటు చేయాలని, అలా చేయని చోట అధికారులే స్వచ్ఛందంగా ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. సమాచార చట్టం బోర్డులు పెట్టని కార్యాలయాల వివరాలు రాష్ట్ర కమిషన్ కార్యాలయంలో తెలిపితే వెంటనే ఏర్పాటు చేస్తామని వివరించారు. తొలుత స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద

ఆర్టీఐ శ్రేణులు, అధికారులు, విద్యార్థులతో జరిగిన ర్యాలీ నీ ప్రారంభించి పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టిఐ కార్యకర్తల రక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 330 ,86 జీవో ద్వారా వేధింపులు, భౌతిక దాడులు నుండి రక్షణ పొందవచ్చునని ఫోరం ఫర్ ఆర్టిఐ జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషన్ వద్దకు హీరింగ్ కు వచ్చిన వాటి గురించి మాట్లాడుతూ పిఐఒ ల పై క్రమశిక్షణ చర్యలతో పాటు జరిమానాలు విధించాలని రాష్ట్ర కమిషన్ ను కోరతామన్నారు . అదేవిధంగా సెక్షన్ 19 (8) ప్రకారం రాష్ట్ర కమిషన్ హీరింగ్ కు హాజరైన యాక్టివేషన్ లకు యాక్టివిస్టులకు దూరాన్ని బట్టి ఆరోజు పనిని బట్టి నష్ట పరిహారాన్ని పిఐఓ నుండి ఇప్పించాలని కోరారు. రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఎఎస్పీ రాఘవరావు లు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం ప్రకారం సమాచారం అందించడంలో జాప్యం చేసిన పిఐఒకు పదివేల రూపాయలు నష్టపరిహారం రాష్ట్ర కమిషనర్ విధించారని తెలిపారు. దేశ భద్రత అధికారుల వ్యక్తిగత సమాచారం తప్ప మిగిలిన సమాచారాన్ని అడగవచ్చని వాటిని రెండు నుండి 30 రోజుల్లో పి ఐ ఓ లు అందించవచ్చునని చెప్పారు.

మధ్యాహ్నం ఆర్టీఐ పై చర్చా వేదిక కార్యక్రమం జాతీయ ఉపాధ్యక్షులు మట్ట ప్రసాద్ అధ్యక్షత జరిగింది. ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణ రాష్ట్ర ముల ఆర్టీఐ లిస్టులు పలు సమస్యలపై మాట్లాడగా రాష్ట్ర సమాచార కమిషనర్ హరి ప్రసాద్ రెడ్డి పరిష్కార మార్గాలు చెప్పారు. కార్యక్రమంలో డీఈవో కాగిత సామెల్ జిల్లా వైద్యశాల అధికారి బండారు వెంకట రంగారావు, ఆర్డీవో ఎం.శేషరెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎం రామ్మోహన్ తదితరులు మాట్లాడారు. పలువురు పిఐఒ లు, ఫోరమ్ ఫర్ ఆర్టీఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఫలించిన రైతుల ఆందోళన

ఉండవల్లి లిఫ్టుకు విద్యుత్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి రైతుల ఆందోళన ఫలించింది. ఉండవల్లి ఎత్తిపోతల పథకానికి గురువారం ఆ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ చేశారు. ముందుగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఉండవల్లి రైస్ మిల్లు వద్ద ఆందోళన నిర్వహించారు. మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు అధికారుల నుంచి సమాచారం అందింది. వెంటనే సంబంధిత సిబ్బంది లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒకపక్క రైతులకు ఉచిత విద్యుత్

ఆందోళన చేస్తున్న రైతులు

అని చెబుతూ మరోపక్క రైతుల పంట పొలాలకు ఉపయోగపడే ఇరిగేషన్ స్కీమ్‌లకు విద్యుత్ బకాయిలు అంటూ సరఫరా నిలిపివేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉండవల్లి ఎత్తిపోతల పథకాన్ని ఉచిత విద్యుత్ కింద మార్చాలని డిమాండ్ చేశారు. ఈ లిఫ్టు కింద 300 మంది చిన్న, సన్నకారు రైతులు తమ భూములు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. వీరిలో అత్యధిక మంది దళితులు, వెనకబడిన వర్గాల వారేనని

విద్యుత్ ఛార్జీలు చెల్లించనవసరం లేదని ఎస్ఇ కార్యాలయం నుండి వచ్చిన కాపీని చూపుతున్న జొన్నా శివ శంకరరావు

తెలిపారు. ఇటీవల పంట కాలవ భూములపై రోడ్డు ఏర్పాటు చేసే సందర్భంగా నెల రోజుల పాటు పంట కాలవకు నీరు వదలకుండా నిలుపుదల చేశారని చెప్పారు. ఈ సంవత్సరం వర్షాభావం వల్ల రెండు నెలలు ఆలస్యంగా నాట్లు వేశారని తెలిపారు. పంట దిగుబడులపై రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ క్రమంలో విద్యుత్ అధికారులు ఉండవల్లి లిఫ్టుకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం సరైనది కాదన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు సహకరించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ వర్కర్ మృతికి ప్రభుత్వ విధానాలే కారణం

సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి-తాడేపల్లి :వివిధ రకాల యాప్‌లతో పని భారం పెంచి ప్రభుత్వమే ఆశ వర్కర్లను త్రిశంకు స్వర్గంలోకి నెట్టిందని సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. గురువారం తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన ఆశ వర్కర్ కృపమ్మ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చేస్తున్న రిలే దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ పని గంటల భారం పెంచి ఆశాలపై సంబంధిత అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాల అమలును నిలిపివేయాలని కోరారు. రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నన్నపనేని శివాజీ, సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గుంటూరు నగర సిఐటియు కార్యదర్శి కె.శ్రీనివాస్, తాడేపల్లి సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో ఆశాలు అభద్రతా భావంలోకి నెట్టబడ్డారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని

ఆందోళన చేస్తున్న ఆశాలు

డిమాండ్ చేశారు. అందుకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. ఆశ వర్కర్లు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కిరణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంగయ్య దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణ కుమారి, వి.రేణుక, లక్ష్మి, సుగుణ, కె.లక్ష్మి, కె.జ్యోతి, విజయలక్ష్మి, సుమతి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

పంట పొలాల విద్యుత్ తీగలకు అవాంతరం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వ్యవసాయ పంట పొలాలకు విద్యుత్తు సరఫరా చేసే, విద్యుత్తు లైన్ తీగలకు ముళ్ళ చెట్లతో, పిచ్చి దొండ ఆకు దట్టంగా అల్లుకొని, ఇక్కడ విద్యుత్ స్తంభం ఉన్నదా? అనే భావన చూసేవారికి కలుగుతుంది. ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామం నుండి కే ఎల్ యు కు వెళ్ళు దారిలో విద్యుత్ తీగలు క్రిందకి వంగి ఉన్నాయి. మరోవైపున ముళ్ళ చెట్లు ఏపుగా పెరిగి, విద్యుత్తు లైన్లను కప్పేస్తున్నాయి. నిత్యం వ్యవసాయ పంటలకు వ్యవసాయ మోటార్ల ద్వారా నీరు మళ్లించుకునే రైతులు రోడ్డు పైకి ఒంగి ఉన్న విద్యుత్ తీగల ను చూసి ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన జరగరాని ప్రమాదం ఏదైనా ముంచుకు వస్తే రైతాంగం నష్టపోవలసి వస్తుంది. సంబంధిత విద్యుత్ అధికారులు గుండె మెడ పంట పొలాలు వైపు ఒంగి ఉన్న విద్యుత్తు లైన్ లు సరిచేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణా, గుంటూరు జిల్లాల పాఠశాల స్థాయి బాక్సింగ్ పోటీల్లో తాడేపల్లి సుందరయ్యనగర్‌కు చెందిన భజరంగ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో తమ సత్తా చాటినట్లు అకాడమీ కార్యదర్శి, కోచ్ కె.సంఘవి గురువారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14,19 బాక్సింగ్ పోటీల్లో నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. గత 29వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 బాక్సింగ్ పోటీల్లో నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-19 బాలురు 60 కిలోల విభాగంలో ఎం.వివేక్, 52 కిలోల విభాగంలో ఎస్‌కె దావూద్, 69 కిలోల విభాగంలో మహ్మద్ నురూరిఖాన్, 66 కిలోల విభాగంలో సిహెచ్.హేమంత్ ఎంపికైనట్లు వివరించారు. అండర్-14 విభాగంలో దొంతా శశాంక్, పి.శ్రీలక్ష్మి, మహ్మద్ అఫ్రమున్నీస, బేబిభవ్యశ్రీ ఎంపికైనట్లు చెప్పారు. వీరిని కార్యవర్గ సభ్యులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా తమ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

జగనన్న కాలనీని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - చేబ్రోలు

ప్రత్యేక అధికారి పల్లవి ఆధ్వర్యంలో కొత్త రెడ్డిపాలెం జగనన్న కాలనీని సందర్శించి కాలనీలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మండల అధికారులు పరిశీలించారు. జగనన్న కాలనీలో రాకపోకలకు సంబంధించి రోడ్డు నిర్మాణం, కాలనీలో అంతర్గత రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ కాలువల నిర్మాణము గురించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మండల ప్రత్యేక అధికారి పల్లవి తెలిపినట్లు తాసిల్దార్ కె వి గోపాలకృష్ణ, ఎంపిడిఒ బి బాబురావు తెలిపారు. తాగునీటి కోసం బోర్లు నమూనాలు సేకరించి పై అధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఎస్ కే జానీ భాష, హౌసింగ్ డి ఈ కె మోహన రావు, ఎలక్ట్రికల్ ఎ ఈ సుధీర్, పి ఆర్ ఎ ఈ జి వరదరాజు, పరిషత్ అభివృద్ధి అధికారి బి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నంకు అంతర్జాతీయ బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరుకు చెందిన సాహితీవేత్త చిట్టిప్రోలు వెంకటరత్నంకు మండలి ఫౌండేషన్ వారు తెలుగు భారతి గొప్పతనం గురించి ప్రపంచలోని తెలుగు వారందరిలో నిర్వహించిన పోటీల్లో తృతీయ బహుమతి సాధించారు. వెంకట రత్నం ఇప్పటి వరకూ మదర్ థెరిస్సా జీవిత చరిత్ర అనువాద గ్రంధమైన 'అమ్మకథ' తో సహా ఏడు గ్రంథాలు రచించారు. కవితా సంపుటి, వ్యాస సంపుటి, విమర్శ గ్రంథం, నాటకం మొదలైన విభిన్న ప్రక్రియలలో గేయ వచనగేయ, గీత పద్యాలు రాసిన వెంకటరత్నం ఇప్పటి వరూ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం సహా ఎనిమిది పురస్కారాలు పొందారు. చారిత్రాత్మక ప్రాధాన్యం గల పలనాడులోని నాయకురాలు నాగమ్మ పుట్టిన గామాలపాడు వెంకటరత్నం స్వగ్రామం. ఈయన తండ్రి చిట్టిప్రోలు కృష్ణమూర్తి 2008లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. వెంకటరత్నంకు ఈ సందర్భంగా అమరావతి సాహితీమిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు, సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ బీరం సుందరరావు, హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మా డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య అభినందనలు తెలిపారు.

ఆర్‌టిఐని ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాచార హక్కుని ప్రజలు మరింత సులభంగా సమర్థవంతంగా వినియోగించు కునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ వెల్లడించారు. సమాచార హక్కు చట్టం అమలు లోకి వచ్చి 18 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శామ్యూల్ జోనాథన్ గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రజలు తాము కోరిన సమాచారం ప్రభుత్వ సంస్థల నుంచి పొందేందుకు కేవలం తెల్ల కాగితం పైన 10 రూపాయల కోర్టు ఫీ స్టాంప్ అంటించి పొందవచ్చు న్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని సకాలంలో అదించని అధికారులపై వెంటనే తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. సమాచార హక్కు కార్యకర్త లపై దాడులు బెదిరింపులు వస్తే వెంటనే జిల్లా ఎస్పి కి సమాచారం ఇచ్చి వారి రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీఐని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దేందుకు ఇ పోర్టల్ ద్వారా పూర్తి సమాచారం తెలుసుకునే సరికొత్త విధానాన్ని త్వరలో అందు బాటులోకి తెస్తున్నట్లు శామ్యూల్ జోనాథన్ వెల్లడించారు.

డిఆర్ఎం కార్యాలయంలో వార్షిక వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్‌గా యం.రామకృష్ణ బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న గురువారం స్థానిక పట్టాభిపురంలోని డిఆర్ఎం కార్యాలయంలో వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం కేక్ కట్ చేసి ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని వివరించారు. అధికారులు, ఉద్యోగులు ఈ సందర్భంగా డిఆర్ఎంకు పూలబొకేలు అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గజ్జెలకొండ-తర్లుపాడు లైన్‌లో 25.42 కిలోమీటర్ల దూరం విద్యుదీకరణ, చీకటీగలపాలెం-గుండ్లకమ్మ డబ్లింగ్ లైన్ ప్రారంభం, మునుమాక-శావల్యాపురం 21.578 కిలోమీటర్ల దూరం విద్యుదీకరణ డబ్లింగ్, తదితర లైన్లలో డబ్లింగ్, విద్యుదీకరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో చేపట్టిన మౌలిక

కేక్ కట్ చేస్తున్న డిఆర్ఎం

సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్ 1లో కొత్త ఎస్కలేటర్, గుంటూరులో రిటైనింగ్ రూములు ప్రారంభించినట్లు చెప్పారు. ఏపి టూరిజం వారు గుంటూరు రైల్లే స్టషన్‌ను 2023 సంవత్సరానికి ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ స్టేషన్‌గా ఎంపిక చేశారన్నారు.

లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా రుణాలు

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఋణాలు పొందవచ్చని, గొర్రెలు మేకలు కోళ్ళ పెంపకంపై దృష్టి సారించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జె.పి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక కొత్తపేట పశువైద్యశాలలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యములో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా ఎంటర్‌ప్రెన్యూవర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగముగా ఔత్సాహిక రైతులకు, నిరుద్యోగులకు జీవాల పెంపకందారులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకలు సహకార సమాఖ్య చైర్మన్ గన్నేరు ప్రకాశం యాదవ్ మాట్లాడుతూ ఈ పథకములో గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ళ పెంపకం, పందుల పెంపకం, పశుగ్రాస , దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్దతులు పాటించడం ద్వారా అసంఘటితంగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని వ్యవస్థీకత రంగంలోకి తీసుకువచ్చి పాలు, గ్రుడ్లు, మాంసం ఉత్పత్తిని పెంచి, వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు, గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి దోహదం చేస్తుందన్నారు. ఈ మిషన్ ద్వారా గ్రామీణ స్థాయిలో పాలు, మాంసం, గ్రుడ్ల ఉత్పత్తిని పెంచుకుని అధిక ఆదాయం పొందడం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పించి సుస్థిరతను, ఆత్మనిర్భరతను సాధించవచ్చని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ బూడిద సైదులు అన్నారు. అనుభవం గల పశుపోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు,సెక్షన్-8 కంపెనీల నుండి అర్హతను బట్టి లబ్దిదారుల ఎంపిక విధానం జరుగుతుందని జాయింట్ డైరెక్టర్ డాక్టర్. ఆర్.చిన్నయ్య తెలిపారు. లబ్దిదారుల ఎంపిక విధానం, సబ్సిడీ విడుదల చేసే విధానం గురించి ఆర్.మహిపాల్‌రెడ్డి, ఎల్‌డిఎం, జి.శరత్‌బాబు వివరించారు. ఈ సదస్సులో డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ లగడపాటి వెంకటరావు, పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు కేదారేశ్వర్‌రావు, ఎం.రత్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నడకే అన్ని జబ్బులకు మందు!

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం, నడకే దాదాపు అన్ని జబ్బులకు మందు అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ ఆర్థరైటిస్‌డేను పురస్కరించుకొని అసోసియేషన్ గుంటూరుశాఖ, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ నందు ఆర్థరైటిస్పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని

ఎముకల సాంద్రతకు మందులను అందచేస్తున్న వైద్యులు శ్రీనివాసరావు, నరేంద్రరెడ్డి

డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు ప్రారంభించారు. వాకర్స్‌తో కలిపి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిఎండి మిషన్ ద్వారా ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు నడకతో మానసిక దఢత్వాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. టెక్నైల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి, గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల సాకారం : మంత్రి అంబటి

ధూళిపాళ్ల పరిధిలోని జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సాకారం చేశారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ జగనన్న కాలనీకి 27 ఎకరాల భూమి భూములు ఇచ్చిన రైతులను అభినందించారు. నరసారావు పేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ హైవే పక్కనే కాలనీ నిర్మాణం చేయటం అభినందనీయమన్నారు. నవంబర్ చివరిలోగా పేరేచర్ల -కొండమోడు జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష పదివేల పట్టాలు మంజూరు చేయగా 40 వేల నివాసాలు ప్రారంభించామని, వాటిలో 9 వేలు పూర్తయ్యాయని, ఒక దూళిపాళ్లలోనే 300 కు పైగా నివాసాలు ప్రారం భించుకోవడం అభినందనీయ మన్నారు. 1130 పట్టాలు ఇక్కడ మంజూరు చేశా మన్నారు. ఇల్లు నిర్మించడం తేలికే గాని ఒక కాలనీని నిర్మిం చడం అంటే చాలా కష్టమన్నారు. ధూళిపాళ్లలో భూమి కొను గోలుకు రూ. 8.5 కోట్లు వసతులు, వనరులు, లెవెలింగ్, ఇతర నిర్మాణాలకు రూ. 14.5 కోట్లు వెచ్చించామని వివరిం చారు. ముందుగా నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ళు శిలా ఫలకాన్ని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం గృహ నిర్మాణాలు పూర్తయిన పలువురి లబ్ధిదారుల నివాసాలను ప్రారం భించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కల్పశ్రీ, మున్సి పల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, మున్సి పల్ కమిషనర్ కె.షమీ, తహశీల్దార్ సురేష్, ఎంపీడీవో జీవి సత్య నారాయణ పాల్గొన్నారు.

శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు,చిత్రంలో ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, జెసి శ్యామ్‌ప్రసాద్

పంప్‌హౌస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మాచర్ల

మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని పంప్‌హౌస్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి,మున్సిపల్ చైర్మన్ మాచర్ల చినఏసోబు, కమిషనర్ ఇవి రమణబాబులతో కలిసి గురువారం పరిశీలించారు. బుధవారం పంప్‌హౌస్‌లో మరమ్మతులకు గురైన వ్యాక్యూమ్ మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో బుధవారం సాయంత్రం నుండి మాచర్ల టౌన్‌లో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎం.ఎల్.ఎ ఆదేశాలతో విజయవాడ నుండి ప్రత్యేక వాహనంలో వ్యాక్యూమ్ మోటారును తెప్పించి మరమ్మతులను వేగవంతం చేశారు. శుక్రవారం నుండి నీటి విడుదలకు అధికారులు, సిబ్బంది తీవ్ర కృషి చేస్తున్నట్లు రామక్రిష్ణారెడ్డి తెలిపారు. పరిశీలనలో డిఇ ఓలేటి మధుసూదన్, ఎఇలు శ్యామూల్, ఆడపా ఆదిత్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణమండపానికి ఎకరం భూమి కేటాయింపు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరులో పూర్వసమితి ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపం నిర్మాణానికి ఎకరం భూమి కేటాయించి స్వాధీన పత్రాలను పెదకూరపాడు తహశీల్దార్ జియా ఉల్ హక్ ,టిటిడి ప్రాపర్టీస్ ఎమ్మార్వో ఏ మధుసూధన్ రావు కి గురువారం అందజేశారు .ఇప్పటికే రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు కాగా దాతలు వాటాగా రూ.40లక్షలు డిడి లు టి టి డి వారికి చెల్లించారు.ఈకార్యక్రమంలో టి టి డి ఎ ఈ జగన్ మోహన్ రావు,టి.బాలాజీ,సర్వేయర్ శివశ్రీనివాస రావు,మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి నరెడ్డి శ్రీనివాసరెడ్డి,సచివాలయ సర్వేయర్ కోమలి,వీఆర్వో ప్రసాద్,గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'నాపై కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు'

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

తనపై అక్రమంగా సిబిఐ కేసులు పెట్టేందుకు వైసిపి నాయకులు సిద్ధం అవుతున్నారని, ఎన్ని కేసులు పెడితే అంత పెద్దవాడిని అవుతానని గురజాల మాజీ శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యలయం నందు విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తుందని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని అన్నారు. టిడిపికి చెందిన మరో 30మందిని ఈ అక్రమ కేసులలో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అ 30మందిలో తానూ ఒకడిని అని అన్నారు. తనపై సిబిఐ కేసులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి తమ పార్టీ ఎంపీలు నలుగురికి పురమాయించారని ఆరోపించారు.

ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభం

ప్రజాశక్తి-వినుకొండ

గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు సహకరిస్తున్న ఇరిడా, బాల వికాస స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలు అన్నారు. మండలంలోని పొట్లూరు మతుకుమల్లి గ్రామాలలో ఇరిడ, బాలవికాస, ఎంపి నిధులతో నిర్మించిన ఆర్‌ఒ ప్లాంట్లను గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ అభివృద్ధిని గ్రామ స్థాయికి చేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు తాగటం వల్ల అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని తెలిపారు. గ్రామాలలో స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల నుండి సీఎం జగన్మోహన్ రెడ్డి సహకారంతో వినుకొండ నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సర్పంచ్లు పోపురు జ్యోతి చిన్న, ఎలగాల బసవయ్య, ఆర్ డబ్లు ఎస్సీ సురేష్, బాల వికాస సీనియర్ జనరల్ మేనేజర్ సంజీవ్ కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డి ఎల్ డి ఓ వెంకటరెడ్డి ఎంపీడీవో పేరు మీద సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కొచ్చర్ల చేపల చెరువు వేలం రూ. 20.85 లక్షలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్ల గ్రామపంచాయతి పరిధిలోని మంగళవాని చేపల చెరువు వేలంపాటను గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తెలిపారు.2023-24,2024-25 సంవత్సరాల కాలపరిమితితో ఈ బహిరంగ వేలం పాటను ఈఓపిఆర్డి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టారు. ధరావత్తు చెల్లించిన ముగ్గురు వ్యక్తులు వేలంపాటలో పాల్గొనగా వారిలో పూజారి శ్రీనివాస్ రూ. 20.85 లక్షలకు చేపలు సాగుచేసేందుకు చెరువును దక్కించుకున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు, పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ శిక్షణ కోసం మెటీరియల్ ను గురువారం అందించారు. పెరుమాళ్లపల్లి మనీషా కు హుస్సేన్ నగరంలో ఉన్నత విద్య నిమిత్తం లాప్టాప్ అందించారు. ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రోటరీ ఆధ్వర్యంలో వికలాంగులకు బస్సు పాస్‌లు

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వంద మంది దివ్యాంగులకు బస్ పాస్‌లను ఇప్పించటం జరిగింది. రోటేరియన్ తుమ్మల సత్యప్రసాదు జన్మదినాన్ని పురస్కరించుకుని బస్సు పాస్‌లను ఉచితంగా వారికి అందజేశారు. బస్సుపాస్‌లకు అయ్యే రూ.10 వేల ను ఆర్.టి.సి అధికారులకు ప్రసాదు చెల్లించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని సత్యనారాయణ, పఠాన్ నాగూర్‌వలి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తి ధ్రువీకరణపత్రాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

'స్వమిత్వ'పై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, చిత్రంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తదితరులు

జిల్లాలో జగనన్న భూరక్ష , భూహక్కు పథకం కింద జరుగుతున్న స్వమిత్వ ప్రోగ్రాం పై కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నరసరావుపేట టౌన్ హాల్‌లో జరిగిన ఈ సమీక్షలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శు లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లై కంప్లీట్ అయి మ్యాపులు వచ్చిన గ్రామాల్లో జరిగే సర్వే విషయమై సమీక్షించారు. ఈ సమీక్షలో భాగంగా గ్రామ కంఠంలో నివాసం ఉండే ప్రజ లందరికీ ఆస్తి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే నిమిత్తం ఎటు వంటి దాపరికం లేకుండా స్వచ్ఛందంగా సర్వేను నిర్వహిం చాలని అన్నారు. ఆస్తి ధ్రువీకరణ పత్రాలు గురించి, దాని అవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆస్థి ధృవీకరణ పత్రాన్ని ఒక దస్తావేజుగా పరిగణించాలని, ఆర్థికపరమైన ఇబ్బందులను అధిగమించడానికి బ్యాంకులో తాకట్టు పెట్టుకుని రుణం తీసుకోవచ్చని, పిల్లల చదువులకు గాని ఇతర అవసరాలకు గాని ఈ ఆస్తి ధ్రువీకరణ పత్రము ఉపయోగపడుతుందని, ఈ విషయమై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అదేవిధంగా సూచించారు. గ్రామ సచివా లయం స్థాయిలో జరిగే దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా ఆస్తి ధ్రువీ కరణ పత్రం యొక్క ముటేషన్ జరపటానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు సర్వే పూర్తయి నోటిఫికేషన్ జారీ అయిన గ్రామాల్లో ఆస్తి ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకుగాను ,త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని విస్తరణ అధికారులకు పంచాయతి కార్యదర్శులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు.

కలక్టరేట్ లో ఉద్యోగులకు కంటి పరీక్షలు

ప్రపంచ కంటి చూపు దినోత్సవం సందర్భంగా 'పని దగ్గర కంటిని ప్రేమించు' థీమ్ లో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి శిబిరాన్ని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించారు. కలెక్టరేట్ లోని 140 మంది సిబ్బందికి కంటి పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు అవసరం వారికి సలహాలు తెలియజేశారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ ఎ.భువనేశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ బి రంగా రావు, ఏరియా ఆసుపత్రి డాక్టర్లు జి.పాల్ చంద్రశేఖర్, డాక్టర్ హేమశ్రీ, ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ ఎం.రామకృష్ణ, కె మురళీకష్ణ,ఎమ్‌విరెడ్డి కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించిన ఎంవి రెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డిని కలెక్టర్, అధికారులు అభినందించారు.

బెజవాడ వెంకట నాగేశ్వరరావుకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-వినుకొండ

బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులను సేవారత్న అవార్డుతో ఘనంగా సన్మానించినారు. స్థానిక సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో వినుకొండ జాషువా కళా ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ఎల్.శివశంకర్ హాజరయ్యారు. కరోనా సమయంలో

ప్రైవేటు స్కూల్ టీచర్లకు 13 విడతలుగా రూ.50 లక్షలు విలువైన రైస్ బ్యాగ్స్‌ను, నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసినందుకు గాను ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దంపతులను కలెక్టర్ సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు.

పేరేచర్లలో 188 జగనన్న ఇళ్లు ప్రారంభం

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండలం పేరేచర్ల-3 కైలాసగిరి లేఅవుట్‌లో నిర్మించిన గృహాలలో ప్రవేశా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, శాసన మండలి సభ్యులు మరియు ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జడ్పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ట్రైనీ కలెక్టర్ కె స్వాతి, తాడికొండ సమన్వక కర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లే అవుట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా సామర్లకోట నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి గారి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు మరియు ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్. జగన్ మోహన్ రెడ్డి గారికి తోడుగా నిలవాలని కోరారు. భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలకు ఇంటి స్థలాలు అందించి వారికి భారీ ఎత్తున ఇళ్ళను కట్టివ్వడం జరుగుతున్నదన్నారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికి ఇల్లు కార్యక్రమం చారిత్రాత్మకమైనదన్నారు. రాష్ట్రంలో 33 లక్షల మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఈ రోజు ముఖ్యమంత్రి వర్యులు గహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటున్నారని , అందులో భాగంగా పేరేచర్ల -3 లే అవుట్ లో 4.82 ఎకరాల్లో 188 గృహ ప్రవేశాలు చేశారన్నారు.కులం, మతం, పార్టీ తారతమ్యాలు లేకుండా సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి వివిధ కారణాలతో ప్రభుత్వ ఫలాలు అందని వారందరినీ గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందేటట్లు చర్యలు

తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 11 రకాల సర్వీసులను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ప్రజలకు అందించడం జరిగిందన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతు లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అర్హత ఉండి లబ్ధి పొందని వారికోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. తద్వారా 11 రకాల సర్టిఫికెట్లను మంజూరు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జడ్పిటిసి కందుల సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నందులపేట టిఆర్ఎస్ కాలనీలోని హరితా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. శిభిరంలో వైద్యులు డాక్టర్ ధూళిపాళ్ళ రవీంద్రనాధ్, డాక్టర్ చందు శివ పాల్గొని విద్యార్థులకు పంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, పేస్టులు అందించారు. దాదాపు 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కన్నెగంటి వెంకట కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్య దర్శులు యక్కల రామ్మోహనరావు, ఉదయశంకర్, కోశాధికారి ఎ.వెంకటే శ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సరస్వతీ రాజు అయ్యర్‌కు పోషణ్ కన్సర్వేషన్ మీట్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-ఎఎన్‌యు

విశ్వవిద్యాలయ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆచార్యులు, సెంటర్ ఫర్ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య సరస్వతి రాజు అయ్యర్‌కు ప్రతిష్టాత్మక సదస్సు నుంచి ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న మాంటరి బె అక్వేరియం గ్లోబల్ పోషన్లో ఈనెల 16 17 తేదీల్లో జరిగే సోషల్ సస్టైనబులిటీ అడ్వైజర్ గ్రూప్ మీటింగ్ లో పాల్గొనేందుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ తాను చేసిన పరిశోధనల్లో భాగంగా సోషియో ఎకనామిక్స్ స్టడీ ఇన్ ష్రిం ఫార్మింగ్ కమ్యూనిటీ ఇన్ ఆంధ్రప్రదేశ్ , ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌజన్యంతోచేశానని వివరించారు సదస్సుకు ఇతర దేశాలైన ఫిలిప్పీన్స్, సౌత్ ఆఫ్రికా, ఈస్టర్న్ ఆఫ్రికా, అమెరికా, వియత్నాం, ఆస్ట్రేలియా, చైనా, జర్మనీ, ఇండోనేషియా తదితర దేశాల నుంచి పరిశోధకులు పాల్గొంటారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి .రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులతో వ్యవసాయ అధికారులు

నందివెలుగులో రైతు శిక్షణ సదస్సు

ప్రజాశక్తి-తెనాలిరూరల్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నందివెలుగు గ్రామంలో రైతు అవగాహన సదస్సు జరిగింది. కేంద్ర ప్రభుత్వ పైలట్ ప్రాజెక్ట్ పాఠశాలల ద్వారా మట్టినమునాల పరీక్షలలో భాగంగా రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా గతంలో తెనాలి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతో గుడివాడ, నందివెలుగు గ్రామాల్లో రైతులతో కలిసి 52 మట్టి నమునాలను యాప్ ద్వారా సేకరించారు. పాఠశాలకు జిఐఐ విధానం ద్వారా అందజేయబడిన సాయిల్ టెస్టింగ్ కిట్ మినీల్యాబ్ ద్వారా విద్యార్థులే స్వయంగా మట్టి నమూనాలను సేకరించి విశ్లేషించారు. రైతు సదస్సు ద్వారా రైతులను నేరుగా కలుసుకొని, వారికి తాము తయారుచేసిన నమూనాల ఫలితాలను అధికారులతో కలిసి రైతులకు అందజేశారు. రైతు కష్టాన్ని అర్థం చేసుకున్నామనీ , తరగతి గదిలోనుండి బైటకు వచ్చి ఇలాంటి విషయాలను నేర్చుకోవటం సంతోషకరమని తెనాలి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేసారు. శాస్త్రవేత్త గంగాదేవి, గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా సాయిల్ హెల్త్ కార్డుల ఉపయోగాలను, వాట విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ విజయ లక్ష్మి, సాయిల్ కొరలేటర్ జెడి పద్మజ రత్న మంజుల, ఆత్మ ఉప వ్యవసాయ సంచాలకులు రత్న మంజుల, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి రామాంజనేయులు, తెనాలి కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు కెవి రాజేంద్ర ప్రసాద్,తెనాలి మండల వ్యవసాయాధికారి ప్రేమ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర జడ్‌పి హైస్కూల్లో 'నా భూమి - నా దేశం' కార్యక్రమం

ప్రజాశక్తి-కొల్లిపర

విద్యార్థులలో దేశభక్తి పెంపొందించేందుకు నా భూమి నా దేశం కార్యక్రమం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యులు శివకుమార్ అన్నారు. గురువారం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు శివకుమార్ దేశభక్తి అమరవీరుల త్యాగాలు జాతీయ జెండా విశిష్టతను గురించి విద్యార్థులకు వివరించారు.ఇంటింటికి మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వము జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని శాసనసభ్యులు శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ శాసనసభ్యులు ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి ప్రసంగించారు.

కెవిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :పొన్నూరు విద్య నగర్‌లో వృద్ధుల అమ్మ ఆశ్రమంలో కె.వి.ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ దాతలు నిమ్మకూరి నాగేశ్వరరావు, మల్కాపురపు వెంకటేశ్వరావు సౌజన్యంతో గురువారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ధ్యక్షులు ఉమా శంకర్, ట్రస్ట్ సభ్యులు భాస్కర్ రామకృష్ణ, రాజేష్ మండ్రు కిరణ్ పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలగడం లేదు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని నార్త్ క్యాబినపేట ఎనిమిదవ వార్డులో నాలుగు నెలల నుండి వీధి దీపాలు వెలగడం లేదు ఆ ప్రాంతంలో చీకటిగ ఉండటం వలన రాత్రి సమయంలో పాద చారులు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు సచివాలయానికి ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని, రాత్రి సమయంలో కుక్కలు చీకట్లో ఎటువైపు నుంచి దాడి చేస్తాయోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బహుమతి ఇస్తున్న సర్పంచ్ బాలాజీ, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు

గవర్నమెంట్ ఐటీఐలో స్నాతకోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

చినరావూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమానికి జగ్గడిగుంటపాలెం సర్పంచ్ ఖంభం బాలాజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్రప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయబడిన 'కౌశల్ దీక్షంత్ సమరోహ' పథకం ద్వారా ఈ విద్యా సంవత్సరం పాసైన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలు ప్రధానం చేసినట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు ఎం.రామారావు సిహెచ్ లక్ష్మణ్, ఆఫీస్ సూపరింటెండెంట్ కే శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

ఎరువుల షాపులు తనిఖీ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎరువుల దుకాణాలలో గురువారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతానికి వరి పైరుకి కావాల్సిన యూరియా, పొటాష్ ఎరువులు అందుబాటులోనే ఉన్నాయని వారు తెలిపారు. ఎరువులు ఎవరైనా డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. పొన్నూరు మండలంలోని అన్ని ఆర్‌బికెలలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. రైతు సోదరులు ఎవరు యూరియా గురించి పొటాష్ గురించి అలాగే ఇతర కాంప్లెక్స్ ఎరువుల నిల్వల గురించి భయపడవలసిన పనిలేదని మండల వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య తెలిపారు.

ముగ్గురు ఆడుతున్న నాటకం

ప్రజాశక్తి-తాడేపల్లి :ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రులు జగన్, కెసిఆర్, బిజెపి నాయకులు ఆడుతున్న నాటకం వల్లే టిడిపి అధినేత చంద్రబాబునాయుడు జైలు పాలయ్యారని ఎన్‌టిఆర్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు పి.రామారావు ఆరోపించారు. పెనుమాకలో గురువారం ఆయన్ను కలిసిన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి సరైన అభ్యర్థిని ఎంపిక చేయకుండా తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ఆ రాష్ట్ర సిఎం కెసిఆర్ ఎపి సిఎంతో చేతులు కలిపారని విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.

దొంగ ఓట్లపై విచారణ జరిపించండి..

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన మాజీ మంత్రి ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి

ఓటరు జాబితాలో చోటుచేసుకున్న అవకతవకలను క్షుణ్ణంగా పరిశీలించాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మను కోరారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ఓటరు జాబితాలో డబుల్, త్రిబుల్ ఎంట్రీలను ఆధారాలతో సహా సబ్ కలెక్టర్‌కు వివరించారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ బూత్‌ల వారిగా పరిశీలిస్తామని హామీనిచ్చినట్లు ఆలపాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25లక్షల దొంగ ఓట్లను చేర్పించే కుట్రకు వైసిపి శ్రీకారం చుట్టిందని, దానిలో తెనాలి నియోజకవర్గంలోనే పదివేల దొంగ ఓట్లు ఉన్నట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లోనూ పిఎస్ఎస్ సిస్టం ద్వారా డబుల్, ట్రిపుల్ ఎంట్రీలను గుర్తించి అప్పటి సబ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. ఒకే డోర్ నెంబర్, ఒకేకుటుంబంలో ఉన్న ఓటర్లను వేర్వేరు బూత్‌లలో ఉండటం ఓటర్లను ఇబ్బంది పెట్టడమేనన్నారు. ఒకే డోర్ నెంబర్లో 10 నుంచి 50 దొంగఓట్లను గుర్తించామన్నారు. ఆ

ఓటరు జాబితాలో తప్పులను సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న ఆలపాటి

మేరకు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. అలాగే వైసిపి కుట్రపూరితంగా చంద్రబాబను కేసుల్లో ఇరికించిదన్నారు. ప్రతిపక్షం గొంతునొక్కటమే ప్రధాన ధేయంగా వైసిపి వ్యవహరిస్తోందని, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ కుద్దూస్, కె.కనకరాంబాబు, అన్నం పిన్నారావు, జె.మహేష్, ఎ.జయలక్ష్మి,, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లలితా హాస్పిటల్ వైద్యుల వినూత్న చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు

శస్త్రచికిత్స జరిగిన వ్యక్తితో వైద్యులు

రోడ్డు ప్రమాదానికి గురై, దాదాపు చేయి కోల్పోయే స్థితిలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌కు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు శస్త్ర చికిత్స చేసి కాపాడారు. 42 ఏళ్ల ట్రాక్టర్ డ్రైవర్ ఈనెల 21న రోడ్డు ప్రమాదానికి గురై, కుడి చేతికి గాయం కావడంతో చేయి నీలిరంగు రంగుకి మారి, తిమ్మిరి ఏర్పడింది. మోచేయి మణికట్టు వద్ద ఎటువంటి నాడి తెలియలేదు. దాదాపు చేయి కోల్పోయే స్థితిలో లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్‌కు తీసుకురాగా, అక్కడి వైద్యులు పరీక్షించి, కుడి చేతికి రక్తాన్ని సరఫరా చేసే ధమని (రక్తనాళం) పూర్తిగా తెగిపోయినదని కనుగొన్నారు. వాస్కులర్ సర్జరీ బందం డాక్టర్ అవినాష్ తాడిబోయిన (చీఫ్ కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్), డాక్టర్ అనురాగ్ పోలవరపు (చీఫ్ - ఎండోవాస్కులర్ ఇంటర్వెన్షన్), డాక్టర్ రవి కుమార్ (సిటివిఎస్ సర్జన్), డాక్టర్ కె. ఆనంద్ బాబు, డాక్టర్ సునీల్ నంద (మత్తు వైద్యులు) కాలు నుండి సిరను ఉపయోగించి ఎమర్జెన్సీ వాస్కులర్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేశారు. ఇప్పుడు రోగి తన కుడి చేతితో మునుపటి లాగా అన్నీ పనులు చేయగలుగుతున్నాడని వైద్యులు తెలిపారు.

సైన్స్ విద్యార్థులతో నాయుడు చక్రనాగ్ తదితరులు

సైన్స్ సబ్జెక్టుల ద్వారా భావి శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల స్థాయిలో విద్యార్థులు సామాన్య, భౌతిక, రసాయన శాస్త్రాల సబ్జెక్టులపై పట్టు సాధించటం ద్వారా భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా రాణించవచ్చని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం, ప్రజ్ఞ మెడి, టెక్నో పాఠశాలలో మూడవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు సామాన్య, భౌతిక, రసాయన శాస్త్రాల సబ్జెక్టులపై అకాడమిక్ డయాగ్రమ్స్ పై మోడల్స్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్ర నాగ్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ తో పాటు ఇతర సబ్జెక్టుల్లో పోటీతత్వం ఉండటం వల్ల వారిలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని తెలియజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయునిలు తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా, ఐటిఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లాలోని పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన వత్తి విద్యా నైపుణ్యాలలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఉపాధి, నైపుణ్య శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాల అధునీకరణపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలలో ఉపాధి అవసరాలకు అనుగుణంగా పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలో సంబంధిత పరిశ్రమల భాగస్వామ్యంతో విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ అందించేందుకు ఒప్పందాలు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వారు అభ్యసిస్తున్న కోర్సులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలలో డిమాండ్ ఉన్న ఉద్యోగాలకు సంబంధించి వృత్తి విద్యా నైపుణ్యాలను మెరుగుపర్చేలా కళాశాలలోని నైపుణ్య కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో మహాత్మగాంధీ ఫెలోషిప్ ఫణీంద్రకుమార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రణయ్, ఉపాధి అధికారి రఘు, నాక్ ఏడీ నర్సింహారావు, సీ డ్యాక్ జెడీఎం శివప్రసాద్ రెడ్డి, పాలిటెక్నిక్ పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న చలపతి విద్యార్థిని

చలపతి విద్యార్థులకు ఫార్మా అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజిలోని, జింకానా ఆడిటోరియంలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ గురువారం నిర్వహించిన ఫార్మా అవార్డ్-2కె23 కార్యక్రమంలో లాం, చలపతి ఫార్మసీ కళాశాల నుండి ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర స్థాయి అధికారుల చేతులమీదుగా బహుమతులు అందచేశారు. బి.ఫార్మసీ విభాగం నుండి పి.రమ్యశ్రీ, ఫార్మా-డి విభాగం నుండి యం.లావణ్య, యం.ఫార్మసీ ఫార్మాస్యూటిక్స్ నుండి టి.రవళిక, అనాలసిస్ నుండి ఎ.సాయిదివ్య, ఫార్మాకాలజీ నుండి పి.చైతన్యసాయి, రెగ్యులేటరీ ఎఫైర్స్ నుండి యం.లక్ష్మీదివ్య, యస్.సాయితేజస్వి అత్యధిక మార్కులు సాధించినందుకుగాను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేశారు.ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అభినందించారు.

ఓపిఎస్ పునరుద్ధరించాలని పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాస్తున్న ఉపాధ్యాయులు

సిఎం జగన్మోహన్‌రెడ్డి 2019 పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు పోస్టు కార్డు ఉద్యమం గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుండా, జిపిఎస్‌ను ముందుకు తెచ్చిందన్నారు. జిపిఎస్ కూడా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ కట్టించుకునే విధానమేనని, దీని వల్ల రిటైర్ అయిన తర్వాత పెన్షన్‌కు గ్యారెంటీ లేదన్నారు. గ్యారెంటీ లేని పెన్షన్ విధానం తీసుకొచ్చి దేశం మొత్తానికి ఆదర్శమని చెప్పటం శోచనీయమన్నారు. పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు లాభం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన మెమో ప్రకారం 2003 డిఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓపిఎస్ పునరుద్ధరణకు చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని, సిఎంకు కార్డులు రాయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్య క్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్. శివపార్వతి, కార్యదర్శులు ఆదినారాయణ, షకీలాబేగం, వెంకటేశ్వరరావు, గోవిందయ్య, రంగారావు, ప్రేమ్‌కుమార్, ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

-ముందస్తు ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్ళ పదవీకాలం పూర్తి

రాజీనామా లేఖను చూపుతున్న చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం తన పదవికి రాజీనామా చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన రాజీనామా ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళకు అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రకటించిన రీతిగా తొలి రెండున్నరేళ్ళు సయ్యద్ ఖలేదానశీంకు కేటాయించారు. ఈ నేపథ్యంలో గతనెల 18వ తేదీకే ఆమె పదవీకాలం ముగిసింది. అయితే ఆమె కుమార్తె వివాహ కార్యక్రమంలో బిజీగా ఉన్న నేపథ్యంలో కొద్దిరోజులు సమయం తీసుకుని రాజీనామా చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన సిఎం జగన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన పదవీకాలం అంతటిలో సహకరించిన అధికారులకు, కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తన హయాంలో చేసిన కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. రాజీనామా సందర్భంగా తమపై ఎన్నో పుకార్లు షికార్లు చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దని తన చివరి శ్వాస వరకూ వైసిపిలోనే ఉంటానని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం తన రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు సమర్పించనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే మిగిలిన రెండున్నరేళ్ళు చైర్‌పర్సన్‌గా బిసి మహిళకు అవకాశం కల్పించనున్నట్లు గతంలోనే ఎమ్మెల్యే ప్రకటించారు. ఆ ప్రకారం 8వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రాధిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడతారని పార్టీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఆ ముహూర్తం కూడా త్వరలోనే వెల్లడి కానుంది.

విజ్ఞాన్స్‌ను సందర్శించిన అబెట్ బృందం

ప్రజాశక్తి-గుంటూరు



అక్రిడేషన్ బృందంతో లావు రత్తయ్య, తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీని అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) అక్రిడిటేషన్ ప్రాసెస్ కమిటీ బందం తనిఖీ నిర్వహించింది. అమెరికా నుంచి వచ్చిన 11 మంది సభ్యులతో కూడిన తనిఖీ బందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకుని తనిఖీ పూర్తి చేసుకున్న మొట్ట మొదటి యూనివర్సిటీ విజ్ఞాన్ అని తెలియజేశారు. తనిఖీ విజయవంతమై అబెట్ అక్రిడిటేషన్ సాధించినట్లైతే విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతాయని తెలియజేశారు. వీటితో పాటు విదేశాలలో ఉన్న యూనివర్సిటీలతో విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్స్, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. అబెట్ అక్రిడిటేషన్ ఉన్న యూనివర్సిటీలకు ఎప్పటికప్పుడు సెల్ఫ్ అసెస్‌మెంట్‌తో పాటు కంటిన్యూస్ ఇంప్రూవ్‌మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఐక్యూఏసీ సిబ్బంది, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాల అభివృద్ధిని సాధించాలి : విసి

ప్రజాశక్తి -ఎఎన్‌యు :వర్సిటీలోని ఫార్మసీ కళాశాల విస్తృత అభివృద్ధి సాధించాలని ఎఎన్‌యు విసి ఆచార్య పి. రాజశేఖర్ ఆకాంక్షించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ విడుదల చేసిన ఎన్‌ఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో దేశంలోనే 63వ స్థానంలో, రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచి ప్రత్యేకతను సాధించిందన్నారు. గడిచిన 6సంవత్సరాల నుంచి ర్యాంకులు సాధిస్తూ ఇతర కళాశాలలకు ఆదర్శంగా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు గురువారం వీసి ఆచార్య పి. రాజశేఖర్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీలారాణిని అభినందించి ఎన్‌ఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవిని సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, నూటా అధ్యక్షులు డాక్టర్ బి. నాగరాజు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ముందుకు రావాలి

- బిల్డర్లతో సమావేశంలో నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాభివృద్ధికి బిల్డర్లు ముందుకు రావాలని, బిల్డర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత బిల్డర్లను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నగరాభివృద్ధికి ప్రభుత్వ నిర్దేశిత పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. భవన నిర్మాణ ప్లాన్ కోసం దరఖాస్తు చేసే సమయంలోనే నిబంధనల మేరకు పన్నులు చెల్లించడం, ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తుకి ముందే రెవెన్యూ విభాగం నుండి సదరు భవనానికి సంబంధించి ఖాళీ స్థల పన్ను, ఇతర పన్నులపై ఎన్‌ఓసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్యుపెన్సీ, మార్ట్‌గేజి విడుదల జాప్యం లేకుండా ఆన్‌లైన్ ద్వారా వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవనాలకు పోస్ట్ వెరిఫికేషన్ కూడా వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఐపిఎల్పి పెండింగ్ ఫైల్స్‌ని 10 రోజుల్లో డిస్పోజ్ చేయాలని, ఓసిలు, డిపిఎంఎస్‌లకు చెక్ లిస్ట్‌లను బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమన్వయం చేసుకొని తయారు చేయాలని సిటీ ప్లానర్‌కి తెలిపారు.సమావేశంలో అదనపు సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్రో, నరేడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు వి.శ్రీనాద్, సీతారామయ్య, సురేష్, దుర్గా ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.